


TGTEL/25/A3190

నేటి దిక్సూచి
తెలుగు దిన పత్రిక

# ది నానో' నయా దందా..

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం!

## ఇంటర్ బోర్డు గుర్తింపు లేదు.. ఫైర్ సేఫ్టీ అసలే లేదు!

## అనుమతులు లేకున్నా లక్షల్లో ఫీజుల దోపిడీ..

## జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మౌనం వెనుక

## 'రహస్యం' ఏంటి..?

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గారూ.. ఇటు చూడండి!







రంగారెడ్డి / బడంగ్‌పేట్ (నేటి దిక్సూచి ప్రతినిధి):విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థలు.. నేడు కాసుల కక్కుర్తితో 'వ్యాపార సామ్రాజ్యాలుగా' మారుతున్నాయి. నూతన విద్యా సంవత్సరం ప్రారంభాన్ని ఆసరాగా చేసుకొని గ్రేటర్ పరిధిలోని కొన్ని ప్రైవేట్ కళాశాలలు అక్రమ సంపాదనకు తెరలేపాయి. ముఖ్యంగా బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలోని "ది నానో జూనియర్ కాలేజ్" వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. కనీస అనుమతులు లేవు.. నిబంధనల ఊసే లేదు.. కానీ అడ్మిషన్ల పేరుతో లక్షల రూపాయల ఫీజులను దండుకుంటూ విద్యా దందాను యథేచ్ఛగా సాగిస్తోంది. నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**కోళ్లు పెట్టే గూళ్లలాంటి ఇరుకు గదులు.. 300 మంది విద్యార్థులు!**

నాదర్‌గుల్‌లోని విజయలక్ష్మీనగర్ కాలనీ వేదికగా ఈ 'నానో' అక్రమ భాగోతం నడుస్తోంది. కేవలం 400 గజాల చిన్న స్థలంలో, గాలి, వెలుతురు సరిగ్గా చొరబడని ఇరుకు భవనాల్లో రెండు క్యాంపస్‌ల పేరుతో కాలేజీ నడుపుతున్నట్లు తెలుస్తోంది.అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు ప్రాణాలు రక్షించుకోవడానికి కనీస నిష్క్రమణ మార్గాలు కూడా ఇక్కడ లేకపోవడం గమనార్హం.

**ఫైర్ సేఫ్టీ సున్నా.. ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?**

గతంలో జరిగిన పలు అగ్నిప్రమాద ఘటనలు ఎందరో విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న విషయం విద్యాశాఖకు గుర్తుండకపోవచ్చు కానీ.. తల్లిదండ్రులను మాత్రం నిత్యం భయపెడుతూనే ఉంది. 'ది నానో' కాలేజీకి మున్సిపల్ అనుమతులు గానీ, అత్యంత కీలకమైన ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్ (అగ్నిమాపక శాఖ సర్టిఫికేట్) గానీ లేవని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. రేపు ఏదైనా అవాంఛనీయ ప్రమాదం జరిగి విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే.. దానికి బాధ్యత కాలేజీ యాజమాన్యానిదా? లేక మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులదా? అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.


దిక్సూచి
ది నానో' పేరుతో విద్యా మాఫియా..?

**ఇంటర్ బోర్డు గుర్తింపు ఉందా..? కేవలం బోర్డుల ప్రచారమేనా..?**

కళాశాల నడపడానికి ఇంటర్మీడియట్ బోర్డు అనుబంధ గుర్తింపు తప్పనిసరి. కానీ, ఈ కాలేజీకి అలాంటి గుర్తింపు పత్రాలు ఏవీ లేవనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కేవలం రంగురంగుల బోర్డులు, ఆకర్షణీయమైన అబద్ధపు ప్రకటనలతో డిస్కౌంట్ల పేరుతో తల్లిదండ్రులను నమ్మించి, అడ్మిషన్లు గుంజుకుంటున్నారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలను పణంగా పెడుతున్నారు.

**అధికారుల మౌనం.. ఫిర్యాదులు బుట్టదాఖలు!**

ఈ విద్యా దందాపై స్థానికుల నుంచి, విద్యార్థి సంఘాల నుంచి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి ఫిర్యాదులు అందినప్పటికీ.. ఆయన 'మౌన వ్రతం' వహించడం వెనుక అంతరార్థం ఏమిటి? చిన్నచిన్న నిబంధనల ఉల్లంఘనలకే సీజ్ చేసే అధికారులు.. వందలాది మంది విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటున్న 'ది నానో' కాలేజీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? తనిఖీలు చేయడానికి అధికారుల కాళ్లు ఎందుకు రావడం లేదు?

**కలెక్టర్ గారూ.. విచారణ జరిపించండి!**


నేటి దిక్సూచి
లక్షల ఫీజులు.. జీరో సేఫ్టీ:
ది 'నానో' కాలేజీలో విద్యార్థుల ప్రాణాలతో జూదం!

విద్యార్థుల భవిష్యత్తు, వారి ప్రాణాల రక్షణ దృష్ట్యా రంగారెడ్డి జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఫైర్ సర్వీసెస్ మరియు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. 'ది నానో' కాలేజీపై సమగ్ర విచారణ జరిపి, అనుమతి లేని ఈ కాలేజీని వెంటనే సీజ్ చేయాలని స్థానికులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పారదర్శకంగా వాస్తవాలను వెల్లడించి, విద్యార్థుల జీవితాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.


ది నానో' పేరుతో విద్యా దందా..?
-అనుమతులు లేకున్నా కాలేజీ నిర్వహణపై ఆరోపణలు
- ఇంటర్మీడియట్ జిల్లా అధికారి మౌనం ఎందుకు..
-ఫైర్ సేఫ్టీ లేదు.. ఇంటర్ బోర్డు గుర్తింపు లేదన్న విమర్శలు..
-వందలాది మంది విద్యార్థులతో తరగతులు.. లక్షల్లో ఫీజుల వసూళ్లు